టీ-మీడియా
Digital, tmedia.net.in
tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...
నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!
సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5
GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN
శుక్రవారం 04/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం..

**-సీఎం ఎదుటే సంతకం!**

టి మీడియా ,సెప్టెంబర్ 3 , హైదరాబాద్ బ్యూరో:తెలంగాణ కాంగ్రెస్‌లో వరుసగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయి. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఎదుటే ఆయన కొండా సురేఖ బర్తరఫ్ ఫైల్‌పై సంతం చేశారు. ఈ మేరకు ఆమెను



➤ మిగతా 2వ పేజిలో..

## పాతబస్తీ మెట్రోను పూర్తి చేస్తామని చెప్పాం

# చేసి చూపిస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

టి మీడియా ,సెప్టెంబర్ 3 , హైదరాబాద్ బ్యూరో: గత సర్కార్ చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సకాలంలో నిధులు ఇవ్వలేదన్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వేగంగా వంతెన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. చంచల్‌గూడ-సంతోష్‌నగర్ రెండో స్టీల్ ఫ్లైఓవర్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదని ఇది ఒరిజినల్ సిటీ అని కొనియాడారు. ఒకప్పుడు హైదరాబాద్ నగర ప్రజలు ఈసీ, మూసీ నది నీళ్లు తాగేవారని, హైదరాబాద్‌కు విదేశీయులు ఎవరు వచ్చినా చార్మినార్ వద్ద షాపింగ్‌కు వస్తారని గుర్తు చేశారు. పాతబస్తీలోని ప్రతి గల్లీ, అణువణువు తనకు తెలుసునని స్పష్టం చేశారు.



### మురుగు సమస్య లేకుండా చేస్తాం

ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేరు చాలా దేశాల్లో సుపరిచితమన్న రేవంత్ రెడ్డి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఎప్పుడూ తన గళం వినిపిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. తన ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారని కొనియాడారు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, మీరాలం కేబుల్ బ్రిడ్జి పూర్తైతే రవాణాపరంగా, పర్యాటకంగా ప్రయోజనమని, ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. పాతబస్తీ మెట్రోను పూర్తి చేస్తామని చెప్పామని, చేసి చూపిస్తామని, నాలాలపై ఆక్రమణలు తొలగిస్తామని, మురుగు సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

### గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారు

కొన్ని శతాబ్ధాలుగా ఈ నగరంలో హిందూ-ముస్లింలు కలిసి జీవిస్తున్నారని, హిందూ- ముస్లింల సమిష్టి కృషితోనే ఈ నగరం

➤ మిగతా 2వ పేజిలో..



# ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలు

**16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీ**

టి మీడియా ,సెప్టెంబర్ 3 , అమరావతి బ్యూరో : ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల మార్గదర్శకాల సవరణకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ఏపీలోని ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ఉన్న మార్గదర్శకాలను సవరించే దిశగా సర్కార్? కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 13న ఇచ్చిన తీర్పు ప్రకారం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

➤ మిగతా 2వ పేజిలో..

# ట్రంప్‌నకు మరోసారి ఎదురుదెబ్బ

**జన్మతః పౌరసత్వ ఆంక్షల ఆదేశాలు నిలిపివేసిన కోర్టు**



టి మీడియా ,సెప్టెంబర్ 3 , ఢిల్లీ బ్యూరో : జన్మతః పౌరసత్వంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి న్యాయస్థానంలో చుక్కెదురైంది. అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు సహజంగా లభించే పౌరసత్వంపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల అమలును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. 'బర్త్ టూరిజం'ను అడ్డుకోవడంతో పాటు, అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించకుండా పరిమితులు తీసుకురావాలని ట్రంప్ ఇటీవల కొత్త ఉత్తర్వులపై సంతకం చేసిన విషయం తెలిసిందే.ఇదే అంశంపై ఇటీవల ట్రంప్‌నకు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో జన్మించిన పిల్లలకు వారి

➤ మిగతా 2వ పేజిలో..

# చిన్నారెడ్డి తొలగింపు

**గద్వాల విజయలక్ష్మి నియామకం**

టి మీడియా ,సెప్టెంబర్ 3 ,వనపర్తి :ఎమ్మెల్యే మేఘారెడ్డిపై కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన పదవికి ఎసరుపెట్టాయి. వాటిని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం కఠిన చర్యలు చేపట్టింది. భవిష్యత్‌లో ఎవరు

➤ మిగతా 2వ పేజిలో..



# బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

**తన కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారని నిలదీత**

టి మీడియా ,సెప్టెంబర్ 3 , హైదరాబాద్ బ్యూరో : మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలన్న నిర్ణయంపై కొండా సురేఖ స్పందించారు. తనని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండించారు. నిర్ణయానికి ముందు

➤ మిగతా 2వ పేజిలో..



# స్వప్రయోజనాలకు అధికారాలు వాడితే కఠిన చర్యలు

- **రైతులను చులకనగా చూస్తే సహించేది లేదు**
- **సమీక్షలో మంత్రి పొంగులేటి**

టి మీడియా ,సెప్టెంబర్ 3 కొత్తగూడెం: రెవెన్యూ శాఖలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే అధికారుల వైఖరి మారాలని, లేకపోతే వారి పదవులు మారే పరిస్థితి వస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు.గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూ రీ-సర్వే, రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు, ఖమ్మం--భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా అధికారాలను క్షేత్రస్థాయికి వికేంద్రీకరించిందని తెలిపారు. ఆ అధికారాలను స్వప్రయోజనాలకు వినియోగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ధరణి వ్యవస్థలో అత్యధిక అధికారాలు కలెక్టర్ వద్దే ఉండేవని, అయినప్పటికీ ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అందుకే భూ భారతి చట్టం ద్వారా అధికారాలను తహసీల్దార్ స్థాయి వరకు వికేంద్రీకరించామని

➤ మిగతా 2వ పేజిలో..

## అమరావతి సంగమం

# నిర్మాణానికి రూ.759.79 కోట్లు

**31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం**



టి మీడియా ,సెప్టెంబర్ 3 , అమరావతి బ్యూరో : 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

అలాగే రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.281 కోట్ల నిధులు సమకూర్చుకునే ప్రతిపాదన, పొగాకు రైతులకు డి బి టి ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అంశాలు కేబినెట్ ముందుకు వచ్చాయి. మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ-2026 ముసాయిదాకు ఆమోదం తెలిపింది.'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759 కోట్ల 79 లక్షల పరిపాలనా అనుమతి ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో 'అమరావతి సంగమం' నిర్మాణం చేపట్టనున్నారు. సాగునీరు, వరద పునరుద్ధరణకు సంబంధించి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 78 పనులకు రూ.6 కోట్ల24 లక్షలకు పైగా పరిపాలనా ఆమోదం, వ్యయానికి అనుమతిపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

### కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులపై చర్చ

వెలిగొండ టన్నెల్-2లో టీబీఎమ్ తొలగింపు పనులకు రూ.11కోట్ల 63 లక్షల మంజూరుపైనా ఆమోదం తెలిపింది. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులకు సంబంధించిన అంశాలపైనా చర్చ జరిగింది. విద్యుత్ రంగంలో ఏపీ ట్రాన్స్‌కో మధ్యకాలిక రుణానికి రూ.950 కోట్ల ప్రభుత్వ గ్యారంటీ, సీలేరు కాంప్లెక్స్‌లో ఏపీ జెన్‌కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపు ప్రతిపాదనలు కేబినెట్ పరిశీలనకు వచ్చాయి.

### కడప జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు

ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలు

జారీ చేసిన ఆదేశాలకనుగుణంగా ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. విద్యాశాఖలోని వివిధ విభాగాల డైరెక్టర్లు, ఎన్టీఆర్ జిల్లా డీఈవో, బాపట్ల ఎంఈవోలతో పాటు న్యాయ సలహాదారులు, ఎన్జీఓ ప్రతినిధి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధి, చట్టం కింద ప్రవేశాలు పొందిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు.ఆర్టీఈ చట్టం, ఏపీ ఆర్టీఈ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సీపీసీఆర్ నిబంధనలను సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ కమిటీ బాధ్యత. ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం, సీట్ల వివరాలు వెల్లడించడం, ఫీజుల రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై నూతన విధానాలను సిఫార్సు చేయనున్నారు. అదేవిధంగా చట్టం అమలులో ఎదురవుతున్న ఆచరణాత్మక, చట్టపరమైన సమస్యలను గుర్తించి పరిష్కారాలు చూపడం, ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు పొందిన పిల్లల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా ఉండేలా పటిష్ట చర్యలు సిఫార్సు చేయడం ఈ కమిటీ బాధ్యతలుగా జీవోలో పొందుపరిచారు.

# ట్రంప్‌నకు మరోసారి ఎదురుదెబ్బ

తల్లిదండ్రుల వలస స్థితితో సంబంధం లేకుండా పౌరసత్వ హక్కు కల్పించే రాజ్యాంగ నిబంధనలను ట్రంప్ పరిమితం చేయాలని ప్రయత్నించారు. అయితే ఆంక్షలపై న్యాయపరమైన వివాదం కొనసాగుతుండగా, ఆయన తీసుకొచ్చిన తాజా ఉత్తర్వులపైనా కోర్టు జోక్యం చేసుకుంది. దీంతో విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని నిరాకరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు మరోసారి అడ్డంకి ఏర్పడింది.

వాషింగ్టన్ డిసి ఫెడరల్ కోర్టులో జరిగిన ఈ విచారణలో జడ్జి డెబోరా బోర్డ్‌మన్ కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం గత వేసవిలో అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించేలా ఈ తాజా ఉత్తర్వులు ఉన్నాయని, ఇవి రాజ్యాంగబద్ధంగా నిలబడే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ తీర్పులో కోర్టు ఒక వెసులుబాటు కూడా కల్పించింది. భవిష్యత్తులో విధానాల అమలుపై ఫెడరల్ ఏజెన్సీలు తమ అంతర్గత మార్గదర్శకాలను సిద్ధం చేసుకోవడానికి మాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఈ నిలుపుదల ఉత్తర్వులు ఈ కేసులో పిటిషనర్లుగా పోరాడుతున్న అర్హులైన వర్గానికి మాత్రమే వర్తిస్తాయని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఈ ఉత్తర్వులను నిలిపివేయకపోతే, సుప్రీంకోర్టు గతంలో పౌరులుగా గుర్తించిన చిన్నారులు సైతం జన్మహక్కు పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ జడ్జిని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ నియమించడం గమనార్హం.అమెరికాలో జన్మించే ప్రతి ఒక్కరికీ పౌరసత్వం కల్పించే 14వ సవరణ నిబంధనలను పరిమితం చేయాలన్నది డొనాల్డ్ ట్రంప్ ఆలోచన. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాల్లో అజెండాలో ప్రధానాంశంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రుల వలసదారుల హోదాతో సంబంధం లేకుండా అమెరికా గడ్డపై పుట్టిన ప్రతీ శిశువుకు పౌరసత్వం లభించే ఈ చట్టానికి పరిమితులు విధించాలని ట్రంప్ మొదటి నుంచీ ప్రయత్నిస్తున్నారు.

ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఒక వసలదారులపై కఠినంగా వ్యవహరిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నవారు లేదా తాత్కాలిక వీసాలపై వచ్చి సంతానం కన్నట్లయితే, ఆ పిల్లలకు పౌరసత్వం ఇవ్వబోమని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారించిన యూఎస్ సుప్రీంకోర్టు ఈ ఏడాది వేసవిలో వాటిని కొట్టివేసింది. ఆ ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పింది.సుప్రీంకోర్టు ఉత్తర్వులను తోసిపుచ్చినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గలేదు. ఆగస్టులో మరో రూపంలో అదే కార్యనిర్వాహక ఉత్తర్వులను జారీ చేశారు. తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, ఒకవేళ ఆ తల్లిదండ్రులలో ఎవరైనా 'శత్రు దేశ వలసదారులు' , 'విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు' లేదా చట్టవిరుద్ధమైన 'బర్త్ టూరిజం' కింద అమెరికాకు వచ్చినవారైతే, ఆ పిల్లలకు జన్మహక్కు పౌరసత్వాన్ని నిరాకరించాలని నిబంధనల్లో చేర్చారు. తొలి ఉత్తర్వులతో పోలిస్తే పరిధిని తగ్గించినప్పటికీ, ఇది కూడా పరోక్షంగా 14వ సవరణను ఉల్లంఘించేలా ఉందని కోర్టు అభిప్రాయపడింది.

# అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

మెగావాట్ల కేటాయింపు రద్దు, విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుల్లో సామర్థ్యాల మార్పిడిపైనా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రుణాలకు సంబంధించి జెన్‌కోకు కార్పొరేట్ గ్యారంటీలు ఇచ్చేందుకు అనుమతిపైనా చర్చించింది. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం, కడప జిల్లాలో - కుసుమ్ కింద సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది.

# స్వప్రయోజనాలకు అధికారాలు వాడితే కఠిన చర్యలు

తెలిపారు. అయితే క్షేత్రస్థాయి అధికారులు ఆ అధికారాలను ప్రజల సమస్యల పరిష్కారానికి కాకుండా స్వప్రయోజనాలకు ఉపయోగిస్తుండటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తులను 'కోల్డ్ స్టోరేజ్'లో ఉంచొద్దు

సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ప్రజలు, రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. అధికారుల పనితీరు సరిగా లేకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, ఇది ఎంతమాత్రం కొనసాగడానికి వీల్లేదని హెచ్చరించారు.రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలు కూడా ప్రభుత్వంలో భాగమేనన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, అధికారుల సౌకర్యం కోసం కాదని స్పష్టం చేశారు. ప్రజల కోసం రూపొందించిన చట్టాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించడం తీవ్ర తప్పిదమన్నారు.రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే రైతులను చులకనగా చూస్తే సహించేది లేదుఅధికారుల వైఖరిలో తక్షణమే మార్పు రావాలని ఆదేశించారు. "ప్రజలే ముఖ్యం.. అధికారులు కాదు" అనే విషయాన్ని ప్రతి అధికారి గుర్తుంచుకోవాలని సూచించారు.

# పాతబస్తీ మెట్రోను పూర్తి చేస్తామని చెప్పాం..చేసి చూపిస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

అభివృద్ధి చెందుతూ వస్తోందని, మూసీ పునరుజ్జీవనం చేపడితే బీజేపీ నేతలు తప్పు పడుతున్నారని వెల్లడించారు. యూపీలో గంగానది, గుజరాత్‌లో సబర్మతి నది ప్రక్షాళన చేపట్టలేదా?, గంగా, సబర్మతి ప్రాజెక్టులను ప్రశంసించిన నేతలు మూసీ ప్రక్షాళనను ఎందుకు తప్పుపడుతున్నారు? నిలదీశారు. రాష్ట్ర బీజేపీ నేతలు గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని విమర్శించారు.

### అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

తననెవవరూ బెదిరించవద్దని, బెదిరిస్తే భయపడనని అన్నారు. స్నేహంతో మాత్రమే తనని గెలవగలరని హితవు పలికారు. తాను ఎవరికీ గులామ్‌ను కాదని దోస్తీకి మాత్రమే గులామ్‌నని సూచించారు. స్నేహం కోసం ఏదైనా చేసే వ్యక్తిని తానని, ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి గెలుపోటములు సహజమని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### ఒవైసీ హాట్ కామెంట్స్

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఉన్నందుకే తాము కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. రేవంత్ రెడ్డిని ఆయన స్టైల్‌లోనే పరిపా లన చేయాలని ఒవైసీ సూచించారు. ఇంకా ప్రజల్లోకి రావాలని ఆయన కోరారు. రేవంత్ పాలనలో హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి చెందాలని కోరారు.

### 30 నిమిషాల సమయం ఆదా

చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం తో చంచల్ గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి. 30 నిమిషాల వరకు ప్రయాణ సమయం ఆదా అవుతుంది. మొత్తం 3.3 కి.మీ. పొడవురూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణంతో నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఒవైసీ ఆస్పత్రి వరకు ఆటంకం లేకుండా ప్రయాణించవచ్చు.

# కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం..

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతు ముందే లోక్ భవన్‌కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాతో సమావేశమయ్యారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభావకర్, అజారుద్దీన్ సైతం వెళ్లారు. అక్కడ కొండా సురేఖ బర్తరఫ్ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ కాసేపటికే గవర్నర్ కొండా సురేఖ బర్తరఫ్‌ను ఆమోదిస్తూ ఫైల్‌పై సంతకం చేశారు.అయితే కొండా సురేఖ మంత్రి పదవి నుంచి తొలగిపోవడంతో ఇప్పుడు ఆ పదవి ఖాళీ అయింది. దీంతో తెలంగాణలో కేబినెట్ విస్తరణపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ప్రభుత్వంలో రెండు పదువలు ఖాళీగా ఉండగా ఇప్పుడు కొండా సురేఖ బర్తరఫ్‌తో 3కు చేరాయి. ఈ నేపథ్యంలో కేబినెట్‌ను కూడా విస్తరించే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో మాట్లాడినట్టు సమాచారం. వీలైతే ఈ నెల 6వ తేదీని కేబినెట్‌ను విస్తరించేకు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.ఇదిలా ఉండగా కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని ఢిల్లీ నుంచి సీఎంవో ఆదేశాలు అందిన వెంటనే ఆమె చాంబర్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ సచివాలయంలోని 4వ ఫ్లోర్‌లో ఉన్న కొండా సురేఖ చాంబర్ పూర్తిగా ఆదీనంలోకి తీసుకున్నారు.

## చిన్నారెడ్డి తొలగింపు

అలాంటి వ్యాఖ్యలు చేయకూడదన్న ఉద్దేశంతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఆయన్ను తొలగించింది. ఆ స్థానంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది.

### గద్వాల విజయలక్ష్మీ నియమకం

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డిపై వేటువేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో కాంగ్రెస్ సీనియర్ నేత కె.కేశవరావు కుమార్తె మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. ఇప్పటివరకు గద్వాల విజయలక్ష్మి నిర్వహించిన తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ బాధ్యతలను పార్టీ సీనియర్ నేత నేరేళ్ల శారదకి మరోమారు అప్పగించింది. కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ ఆథారిటీ- కేయూడీఏఛైర్ పర్సన్‌గా వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణిని నియమించింది.

# బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

తన వివరణ తీసుకోవాల్సిందని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తననెలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని, ఆమె వ్యాఖ్యలు ఆమెవేనని పేర్కొన్నారు. మీడియాకు ఇచ్చిన నోట్‌లో ఊరు, పేరు లేదు.

### రేవంత్ రెడ్డి పట్టుబట్టి

ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు.

తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.

### ప్రజల్లో వ్యతిరేకత ఉంది

మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు.

### ఎమ్మెల్యేగా కొనసాగుతా?

క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని సూచించారు. తాను పునరాలోచించుకోమని చెప్పనని, పార్టీ తీరు మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలని, రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. తనవైపు ఒక వేలు చూపితే రేవంత్‌రెడ్డి వైపు నాలుగువేళ్లు చూపుతాయని ఎద్దేవా చేశారు. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలే దనిఎమ్మెల్యేగా కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

### ఇంకా ఆలోచించుకోలేదు

తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

### రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి

తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు.

### సంతోషంగా ఉంది

తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు.

# చర్మవ్యాధి అడ్డంకి

- ఆధార్ కార్డుకు నోచుకోని తండ్రీకొడుకులు
- ప్రభుత్వ పథకాలకూ దూరం



టి మీడియా ,సెప్టెంబర్ 3 , ఢిల్లీ బ్యూరో : ఆధార్ కార్డు నేటి రోజుల్లో ప్రతి పౌరుడికి అత్యంత కీలకమైన గుర్తింపు పత్రం. ప్రభుత్వ పథకాల నుంచి బ్యాంకింగ్ సేవల వరకు అనేక అవసరాలకు ఇది తప్పనిసరిగా మారింది. అయితే ఒడిశాకు చెందిన వ్యక్తికి మాత్రం ఆధార్ కార్డు పొందడం పెద్ద సవాల్‌గా మారింది. కారణం ఆయనకు ఉన్న అరుదైన అనువంశిక చర్మవ్యాధి. చేతివేళ్లపై సాధారణంగా కనిపించే రేఖలు, ముద్రలు లేకపోవడంతో బయోమెట్రిక్ నమోదు కావడం లేదు. దీంతో అతడు ఆధార్? లేకుండానే జీవిస్తున్నాడు. ఇప్పుడు అదే సమస్య అతడి కుమారుడికి కూడా ఎదురైంది. తండ్రికి వచ్చిన వ్యాధే కుమారుడికీ రావడంతో అతడి వేలిముద్రలు కూడా కనిపించడం లేదు. దీంతో తండ్రీకుమారులు ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.సంబల్‌పూర్ నగరంలోని సఖిపడ ఇద్గాహ్ సమీపంలో 40 ఏళ్ల సమీర్ ఖాన్ నివసిస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తెతో కలిసి ఆయన జీవనం సాగిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సమీర్, ప్రభుత్వ స్థలంలో టిన్ షెడ్ వేసుకుని ఉంటున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో తారు వేసే కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

### చేతి ముద్రలు కనిపించకపోవడంతో

సమీర్‌కు చిన్నప్పటి నుంచే చేతుల అరచేతుల్లో చర్మ సమస్య ఉంది. కాలక్రమంలో అది మరింత తీవ్రమై అరచేతి చర్మం పగిలిపోవడంతో పాటు సాధారణంగా ఉండే రేఖలు, గుర్తులు కనిపించకుండా పోయాయి. దీంతో ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లిన ప్రతిసారీ బయోమెట్రిక్ ఇవ్వడం సాధ్యమయ్యేది కాదు. ఆధార్ నమోదు కోసం సమీర్ పలుమార్లు ప్రయత్నించాడు. సంబల్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంతో పాటు పోస్టాఫీసు, ఇతర ఆధార్ కేంద్రాలకు కూడా వెళ్లాడు. అయితే అధికారులు బయోమెట్రిక్ వివరాల కోసం అతడి వేలిముద్రలు తీసుకునేందుకు ప్రయత్నించినా, అవి సరిగా నమోదుకాలేదు. చేతివేళ్లపై స్పష్టమైన రేఖలు లేకపోవడంతో బయోమెట్రిక్ యంత్రం అతడి వేలిముద్రలను గుర్తించలేకపోయింది. దీంతో ఆధార్ నమోదు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో సమీర్ నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

### కుమారుడికీ అదే వ్యాధి-ప్రభుత్వ పథకాలకూ దూరం

ఇదే పరిస్థితి ఆయన 10 ఏళ్ల కుమారుడు ముజాహిద్ ఖాన్‌కు కూడా ఎదురైంది. ముజాహిద్‌కూ ఇదే తరహా చర్మవ్యాధి ఉండటంతో అతడి ఆధార్ నమోదు కూడా సాధ్యం కావడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఒకే కుటుంబంలో తండ్రి, కుమారుడు ఇద్దరికీ ఆధార్ కార్డులు అందని పరిస్థితి నెలకొంది. ఆధార్ లేకపోవడంతో సమీర్ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పేదరికంలో ఉన్నప్పటికీ పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నామని సమీర్ వాపోతున్నాడు. తన భార్యకు ఆధార్ కార్డు ఉన్నప్పటికీ, కుటుంబానికి సంబంధించిన పథకాల విషయంలో తన ఆధార్ లేకపోవడం సమస్యగా మారుతోందని చెబుతున్నాడు.

### అసలు వ్యాధి ఏమిటి?

సంబల్‌పూర్‌కు చెందిన చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ తన్మయ్ పాధి ఈ సమస్యకు కారణాన్ని వివరించారు. సమీర్ బాధపడుతున్న వ్యాధిని 'పామోప్లాంటర్ కెరటోడెర్మా' అని పిలుస్తారని తెలిపారు. ఈ పరిస్థితిలో అరచేతులు, అరికాళ్లపై చర్మం సాధారణం కంటే మందంగా మారుతుందని వివరించారు. కుటుంబంలో ఇతరులకు కూడా ఇదే సమస్య ఉండటం వల్ల ఇది అనువంశికంగా సంక్రమించే వ్యాధి అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధికి ప్రధాన కారణం జన్యు స్థాయిలో చోటుచేసుకునే మార్పులేనని వైద్యుడు తెలిపారు. చర్మ నిర్మాణానికి సంబంధించిన కొన్ని ప్రొటీన్లలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుందని వివరించారు. దీనికి పూర్తిగా శాశ్వత నివారణ అందించే చికిత్స ప్రస్తుతం లేదని, అయితే మందులు, మలహాలు తదితర చికిత్సలతో కొంతకాలం ఉపశమనం కలిగించవచ్చని చెప్పారు.

### బయోమెట్రిక్ ఎందుకు విఫలమవుతోంది?

ఇలాంటి వ్యాధి ఉన్నవారిలో అరచేతులు, వేళ్లపై ఉండే సహజమైన చర్మ రేఖలు, వేలిముద్రల గుర్తులు అంటే 'డెర్మటోగ్లిఫిక్స్' స్పష్టంగా కనిపించకపోవచ్చని డాక్టర్ తన్మయ్ పాధి తెలిపారు. అందువల్ల బయోమెట్రిక్ యంత్రాలు వేలిముద్రలను గుర్తించలేకపోవచ్చని చెప్పారు. సమీర్ విషయంలోనూ ఇదే జరుగుతోందని వివరించారు. చేతులపై వేలిముద్రలు స్పష్టంగా లేకపోవడంతో ఆధార్ నమోదు సమయంలో బయోమెట్రిక్ ధ్రువీకరణ విఫలమవుతోందని పేర్కొన్నారు. అతడి కుమారుడికి కూడా అదే వ్యాధి ఉండటంతో ఇలాంటి సమస్యే ఎదురవుతోందని తెలిపారు. ఇలాంటి సమస్యతో బాధపడుతున్న పలువురు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగి చివరకు వైద్యులను సంప్రదిస్తున్నారని చెప్పారు.

### జిల్లా యంత్రాంగం స్పందన

ఏళ్లుగా ఆధార్ కోసం తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో సమీర్ చివరకు జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయించారు. తనలాంటి వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపించి ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. ఈ వ్యవహారం జిల్లా కలెక్టర్ సిద్ధేశ్వర్ బలిరామ్ బొందర్ దృష్టికి వెళ్లింది. ఘటనపై సమాచారం అందడంతో ఆధార్‌కు సంబంధించిన నోడల్ అధికారిని సంప్రదించి, విషయాన్ని పరిశీలించాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితుడి ఆధార్ నమోదు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



టి మీడియా ,సెప్టెంబర్ 3 , కూసుమంచి:గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలం కేశవాపురం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లలో కేశవాపురం గ్రామానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో రూ. 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. 3.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. మూడో విడత, నాల్గో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు భరోసానిస్తూ ఇప్పటివరకు 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 11,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద రూ. 67,000 కోట్లు విడుదల చేశామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అక్కడక్కడా ఉన్న యురియా కొరత సమస్యను ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసివో గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, కేశవాపురం గ్రామ సర్పంచ్ బానోతు మమత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## చావా సరస్వతి కి నివాళులు అర్పించిన నున్నా



టి మీడియా ,సెప్టెంబర్ 3 , ఖమ్మం :టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, స్కూల్ టీచర్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా నాఖీ× ప్రధాన కార్యదర్శి చావా రవి గారి మాతృ మూర్తి శ్రీమతి చావా సరస్వతీ ఇటీవల మరణించారు, గురువారం నాడు జజూఅఎ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హైదరాబాద్ లో ఖుఖీ రాష్ట్ర కార్యాలయం లో సరస్వతీ చిత్ర పఠానికి నివాళులర్పించారు. అక్కడే నివాసముంటున్న ఆమె భర్త విశ్రాంత అధ్యాపకులు చావా భాస్కరరావు, కుమారుడు చావా రవి తదితర కుటుంబ సభ్యులను పరామర్శించినారు, ఈ కార్యక్రమం లో జజూఎ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, ఖుఖీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, గోపి పాల్గొన్నారు, ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజాతశీత్ర ఉద్యమాలకు సరస్వతీ అందించిన సేవలు ఆదర్శ నీయం అన్నారు.

## భద్రాద్రి జిల్లాలో మరో అవినీతి తిమింగలం



టీ మీడియా, సెప్టెంబర్ 3, ఆళ్లపల్లి :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల పరిధిలో ని రామానుజగూడెం గ్రామానికి చెందిన ఓ పోడు రైతు నుంచి అటవీశాఖ బీట్ అధికారి బానోత్ రవికుమార్ రూ. 30,000 లంచం డిమాండ్ చేశాడు. పోడు రైతు భూమిలో ట్రెంచ్ తవ్వకాలు చేపట్టకుండా ఉండేందుకు రూ. 30 వేల లంచం డిమాండ్ చేసిన అటవీశాఖ బీట్ అధికారి ఎసీబీ అధికారులకుచిక్కాడు. మధ్యవర్తి సాదిక్ ద్వారా ఈ డబ్బులు స్వీకరిస్తుండగా, ఖమ్మం రేంజ్ ఎసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని అధికారులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. ఎసీబీ అధికారులు నిర్వహించిన ఈ ఆకస్మిక దాడిలో బీట్ అధికారి రవికుమార్‌తో పాటు మధ్యవర్తి సాదిక్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణ అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు సమాచారం. ?అధికారుల వివరాల ప్రకారం, ఈ ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీశాఖకు సంబంధించి ఇది నాలుగో అవినీతి కేసుగా నమోదైంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

## ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ప్రారంభించిన మంత్రి పొంగులేటి




టి మీడియా ,సెప్టెంబర్ 3 , ఖమ్మం:స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్లో మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన యువత ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశయంతో పీఎస్ఆర్ ట్రస్ట్, రైట్ చాయిస్ అకాడమీ ల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కుటుంబాల్లో కనిపించే ఆనందం, వారు చూపే కృతజ్ఞత వర్ణించలేనిదని పేర్కొన్నారు. గతంలో సెలెక్ట్ అయిన అభ్యర్థులతో కలిసి భోజనం చేసిన క్షణాలు తన జీవితంలో అత్యంత మధురమైన జ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు సాధించిన తర్వాత, మీ వద్దకు సహాయం కోసం వచ్చే పేదలను, బాధితులను మనుషుల్లా గౌరవించి, ప్రేమ ఆప్యాయతలతో న్యాయం చేయాలన్నారు. ఉచిత శిక్షణకు సుమారు 2,200 నుండి 2,300 మంది నమోదు చేసుకున్నారని, అందులో 1,500 మంది రోజూ క్రమం తప్పకుండా వచ్చే వారుంటారని, అభ్యర్థులందరికీ మంచి ఫ్యాకల్టీతో పాఠాలు, నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. రాబోయే 60 రోజుల కాలాన్ని అభ్యర్థులు క్రమశిక్షణతో ఉపయోగించుకుని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆకాంక్షిస్తూ, అందరికీ ఆల్ ది బెస్ట్" అని మంత్రి ఆశీర్వదించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో అనుకున్న లక్ష్యాలను, పోటీ పరీక్షల్లో విజయం సాధించడంలో సబ్జెక్ట్ పరిజ్ఞానంతో పాటు సరైన మానసిక దృక్పథం అత్యంత కీలకమైనదని అన్నారు. కార్యక్రమంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు డీసీపీ రామానుజం, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పొకబతిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే ధ్యేయం

• సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



టీ మీడియా, సెప్టెంబర్ 3 ,ఆళ్లపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో నూతన సర్పంచుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని సర్పంచులందరూ సమావేశమై ప్రజా సంక్షేమం మరియు గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా నూతన బాధ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా పాయం రామనర్సయ్య ఉపాధ్యక్షులుగా సుతారి రమాదేవి కార్యదర్శిగా వాసం సుస్మిత కార్యవర్గ ఎన్నిక అనంతరం మండల పరిధిలోని మిగతా సర్పంచులందరూ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పాయం రామ్ నర్సయ్య, ఉపాధ్యక్షురాలు సుతారి రమాదేవి, కార్యదర్శి వాసం సుస్మితలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన సర్పంచులందరికీ ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అందరినీ కలుపుకొని కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## మోడల్ కాలేజీ లో ఫ్రెషర్స్ డే వేడుకలు :హాజరైన సి ఐ




టీ మీడియా, సెప్టెంబర్ 3 పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని తెలంగాణా మోడల్ కాలేజీ లో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తకోట సి ఐ ఓడి రమేష్ హాజరయ్యారు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ చదువుపై ఇరవై సంత్సరాలు దృష్టి పెడితే ఎనబై సంవత్సరాలు నిన్ను మీ తల్లి తండ్రులను తల ఎత్తుకొనే జీవితాన్నిస్తుందని అన్నారు విద్యార్థులు మద్యం ధూమపానం గంజాయిలకు చెడు అలవాట్లకు దూరంగా వుండాలని ముఖ్యంగా సెల్ ఫోన్ లో అనుమానాస్పద ఆన్ లైన్ లింకులు సైబర్ నేరాలు గేములకు దూరంగా ఉండాలనీ రోడ్డు భద్రత నియమలపై పలు సూచనలు చేశారు ప్రతి రోజూ ఒక గంట వ్యాయామంతో అరోగ్యశీగా వుండాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూర్పింటి నరేష్ కుమార్ ఉపాద్యాయులు సిబ్బంది పాల్గోన్నారు.

## హామీలు ఎక్కడ? కొర్రీలు ఎందుకు

• మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

టిమీడియా, సెప్టెంబర్ 3 కురవి: ఎన్నికల ముందు ప్రజలకు భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ హామీల అమలును పక్కన పెట్టి ప్రజలను మభ్యపెడుతోందని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజులు పరిపాలన సంధర్భంగాబి ఆర్ యస్ పార్టి సమర భేరి కొరవి మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...."ఆరు గ్యారంటీలు అని చెప్పి.. ఆరు వందల కొర్రీలు పెడుతున్నారు" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులు, మహిళలు, యువత, పేదలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. హామీలు ఇచ్చేటప్పుడు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. మహిళలకు నెలకు రూ. 2,500, రూ. 500కే గ్యాస్ సిలిండర్, వృద్ధులు, వితంతువులకు రూ. 4,000 పింఛన్, రైతులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ రైతు బీమా హామీలను అమలు చేయకుండా రైతుల గోసను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. పంటలకు బోనస్, రైతు సంక్షేమ పథకాలు, కౌలు రైతుల గుర్తింపు వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను మాటలతో మభ్యపెట్టడం ఇక సాగదని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలే కాంగ్రెస్ ప్రభుత్వానికి గీటురాయిగా మారతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బజ్జూరిపిచ్చిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తోటలాలయ్య బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు గుగులోతురవినాయక్, మాజీ ఎంపీపీ రామచంద్రయ్య,మాజీ వైస్ ఎంపీపీ దొంగలి నరసయ్య, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు ముళ్ళ రమేష్, నూతక్కి నరసరావు యూత్ నాయకులు సంగెం భరత్, బాదె నాగయ్య కొరవి సిరోలు మండలాల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




## శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

టీ మీడియా ,సెప్టెంబర్ 3, పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం పరిధిలోని మోంటిసోరీ హై స్కూలు లో ముందస్తుగా శ్రీ కృష్ణ జన్మాస్టమి వేడుకలలో బాగంగా ఉట్టికొట్టే ఉత్సవాలను నిర్వహించారు విద్యార్థి విద్యార్థినులు గోపికా కృష్ణుని వేషధారణలో నృత్యాలు చేస్తూ అలరించారు అనంతరం ఉట్టికొట్టే ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు పాఠశాల డైరెక్టర్ డి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ చదువులతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాలు అనుసరించాలని వాటి వైపు మొగ్గు చూపాలని అన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థినులు



ఉపాధ్యాయులు తల్లి తండ్రులు పాల్గొన్నారు

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ పిలుపు



టీ మీడియా,సెప్టెంబర్ 03,సింగరేణి(కారేపల్లి):ఈ నెల 8,9 తేదీల్లో మంచిర్యాలలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ పిలుపునిచ్చారు.కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలో మహాసభల వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో రైతులు,వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని,స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సి2050 శాతం గిట్టుబాటు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు.అటవీ హక్కుల చట్టం,పీసా,1/70 చట్టాలను పటిష్టంగా అమలు చేసి ఆదివాసీల భూములు,సహజ వనరులను పరిరక్షించాలని కోరారు.రైతులు,వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణరూపొందిస్తామని తెలిపారు.రైతులు,వ్యవసాయ కూలీలు అధికసంఖ్యలోపాల్గొనిమహాసభలనుజయప్రదంచేయాలనికోరారు.ఈకార్యక్రమంలోకంచర్లశ్రీనివాస్‌రెడ్డి,అల్లంగురవయ్య,చంద్రయ్య,పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి,సుగుణ,కోటమ్మ, మంగమ్మ,నిరోషా,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత మనందరి బాధ్యత : సి ఐ.



టీ.మీడియా,సెప్టెంబర్3,చింతూరు: మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తుమ్మల గ్రామం లో గురువారం మహిళల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్పి పేర్కొన్నారు.పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏ ఎస్ పి బోర్డు హేమంత్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మొబైల్ వాడకం పెరిగిన కొద్ది మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగు తున్నాయన్నారు.మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగేయువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సి ఐ గోపాలకృష్ణ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విదేశీ విద్యా సందర్శనకు కారేపల్లి అధ్యాపకుడు



టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయుల విదేశీ విద్యా సందర్శన,పరిశీలన కార్యక్రమానికి కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు జీలుగుల దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు.రాష్ట్రవ్యాప్తంగా 40 మందితో కూడిన బృందం ఈ పర్యటనకు వెళ్లనుండగా,ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ నుంచి దుర్గాప్రసాద్ ఒక్కరే ఎంపిక కావడం విశేషం.విదేశీ విద్యా విధానాలు,ఆధునిక బోధనా పద్ధతులను ఈ పర్యటనలో అధ్యయనం చేయనున్నారు.పర్యటనలో తెలుసుకున్న అంశాలతో కళాశాలలోని రోబోటిక్స్ ల్యాబ్‌ను మరింత అభివృద్ధి చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి,అధ్యాపకులు ఆకాంక్షించారు.దుర్గాప్రసాద్‌ను ఎంపిక చేసిన ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయులకు ధ్యానంపై ప్రత్యేక శిక్షణ

- -విద్యార్థులకు ధ్యానం నేర్పే విధానంపై అవగాహన



టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి):ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ధ్యానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని గురువారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు.బ్రహ్మశ్రీ పితామహ పత్రీజీ స్ఫూర్తితో కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని ధ్యానంపై శిక్షణ పొందారు.ఈ సందర్భంగా ధ్యానం ఆచరించే విధానం,దైనందిన జీవితంలో దాని ప్రాధాన్యత,మానసిక ప్రశాంతత,ఏకాగ్రత పెంపొందించుకోవడంలో ధ్యానం పాత్ర తదితర అంశాలను వివరించారు.ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల బోధనతో పాటు అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన వాతావరణంలో బోధన సాగించేందుకు ధ్యానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు ధ్యానం

ముఖ్యంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానాన్ని పరిచయం చేసే విధానంపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు.పిల్లలకు ధ్యానాన్ని సులభంగా ఎలా నేర్పాలి,వారిని ధ్యానం వైపు ఎలా ప్రోత్సహించాలి,చదువుపై ఏకాగ్రత పెంపొందించుకునేలా ధ్యాన సాధనను ఎలా అలవాటు చేయాలి అనే అంశాలను వివరించారు.విద్యార్థుల్లో ఏకాగ్రత,క్రమశిక్షణ,సహనం, ఆత్మవిశ్వాసం,సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో ధ్యానం దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు.ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న ధ్యాన పద్ధతులను విద్యార్థులకు తెలియజేస్తే పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ధ్యానంపై అవగాహన ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ సేవాదళ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి,పీఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బుద్ధ,భూపతిరాజు హనుమంతరావు,రమేష్ తదితరులు ధ్యానం ప్రాధాన్యత,ఆచరణ విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.ఎంఈఓ దుగ్గిరాల జయరాజు,కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షురాలు ముక్కా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ధ్యానంపై శిక్షణ ఇవ్వడం ద్వారా దాని ప్రయోజనాలను విద్యార్థుల వరకు తీసుకెళ్లాలన్నదే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఉపాధ్యాయులు శిక్షణలో తెలుసుకున్న అంశాలను పాఠశాలల్లో విద్యార్థులకు బోధించి, వారిలో ధ్యానంపై ఆసక్తి పెంపొందించాలని కోరారు.

# డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



-ఎ యస్ పి. హేమంత్ .

టీ.మీడియా,సెప్టెంబర్3,చింతూరు: డిజిటల్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏ ఎస్ పి హేమంత్ నిమ్మలగూడెం గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో పేర్కొన్నారు. అలాగే

మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తుమ్మల గ్రామం లో గురువారం మహిళల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి పేర్కొన్నారు పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మొబైల్ వాడకం పెరిగిన కొద్ది మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగు తున్నాయన్నారు.మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగేయువతనుఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల లో ఏ యస్ పి, సి ఐ లతో పాటు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటమే మార్గం




- -6న ఖమ్మంలో రాష్ట్రస్థాయి సమావేశం
- -ధరావత్ సక్రు

టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి):ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ కారేపల్లి--కామేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రు పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 6న ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం కారేపల్లి మండలం మాదారం స్టీల్ ప్లాంట్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ధరావత్ సక్రు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా,పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు,వాటి పరిష్కార మార్గాలు,కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు భవిష్యత్ పోరాట కార్యాచరణపై చర్చించేందుకు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.'పెట్టుబడిదారీ సంక్షోభం--కార్మిక వర్గంపై ప్రభావం'అనే అంశంపై రాజకీయ విశ్లేషకులు, విద్యావేత్త వి.వి.రమణరావు ప్రసంగించనున్నట్లు తెలిపారు.టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షులు వనమాల కృష్ణ,రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ,జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వెంకట్‌రెడ్డి,జి.రామయ్య తదితరులు జనరల్ కౌన్సిల్‌లో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం,హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు వివిధ రంగాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ధరావత్ సక్రు కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో శివ,చందూలాల్,వీరన్న,బిక్కు,లాలు,సంతు,నవీన్,రవి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుడు--రాధ,గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు



టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి): కారేపల్లిలోని బ్రిలియంట్ స్కూల్,మాంటిసోరి స్కూల్‌లలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.శ్రీకృష్ణుడు,రాధ,గోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.చిన్నారుల వేషధారణలు,నృత్య ప్రదర్శనలతో పాఠశాలల్లో కృష్ణాష్టమి పండుగ వాతావరణం నెలకొంది.బ్రిలియంట్ స్కూల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు,రాధ,గోపికల వేషధారణలతో అలరించారు.విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.అనంతరం విద్యార్థులతో సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్,ప్రిన్సిపాల్ మల్లెల నాగేశ్వరరావు మాట్లాడుతూ పండుగల ద్వారా భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు,విలువలను చిన్నారులకు పరిచయం చేయడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు.విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు మన సంస్కృతి,సంప్రదాయాలు,పండుగల విశిష్టతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### మాంటిసోరి స్కూల్లో

కారేపల్లి మాంటిసోరి స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి.శ్రీకృష్ణుడు,రాధ,గోపికల వేషధారణల్లో విద్యార్థినీ విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థుల ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో మాంటిసోరి స్కూల్ ప్రిన్సిపాల్ మినీ జోజో,ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి సమక్షంలో జాన్‌రెడ్డి వేడుకలు



టి మీడియా, సెప్టెంబర్ 3 ,ఖమ్మం రూరల్:ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పొలిశెట్టిగూడెం సర్పంచ్ జాన్‌రెడ్డి వేడుకలు గురువారం నిర్వహించారు. ఖమ్మం నగరంలోని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాన్‌రెడ్డి చేత కేక్ కట్ చేయించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందేలా కృషి చేయాలని, యువత రాజకీయాల్లోకి రావాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, మద్ది కిషోర్‌రెడ్డి, తల్లంపాడు సర్పంచ్ అంబేద్కర్, నాయకులు తేజావత్ పంతులునాయక్, గూడూరుపాడు గ్రామ అధ్యక్షుడు బండి మల్లిఖార్జున్, ఆరెకోడు సురేష్, తేజావత్ పంతులునాయక్, మాజీ సర్పంచ్ ముత్యం కృష్ణారావు, గునిగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తమ్మిశెట్టి శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు



టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి): కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకుడు తమ్మిశెట్టి శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించింది.బోధనలో వినూత్న పద్ధతులు అవలంబిస్తూ విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు కృషి చేసినందుకు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.చరిత్ర పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కూడా శ్రీనివాస్ సేవలందిస్తున్నారు.ఆయనకు రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి,అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- నేడుబీఆర్ఎస్ఆధ్వర్యంలో రాస్తారోకో,వంటా వార్పు



టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి):ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు విమర్శించారు.కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు మేలు చేయడం కంటే ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలే ఎక్కువగా ఉన్నాయని వారు ఆరోపించారు.గురువారం కారేపల్లి క్రాస్‌రోడ్డులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు,420 హామీలతో ప్రజలను ఆకర్షించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చారని,నిషేధిత భూముల అంశంతో రైతులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.రైతు రుణమాఫీ విషయంలో రైతులకు పూర్తి న్యాయం జరగలేదని,రైతు భరోసా పెట్టుబడి సాయం విషయంలోనూ రైతుల్లో అనిశ్చితి నెలకొందని పేర్కొన్నారు.రైతు బీమా ప్రయోజనాలు సకాలంలో అందకపోవడంతో బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని తెలిపారు.కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల అమలుపైనా అనిశ్చితి నెలకొందని ఆరోపించారు.ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులందరికీ న్యాయం జరగడం లేదని,కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శుక్రవారం కారేపల్లి క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో,వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు ముత్యాల వెంకట అప్పారావు,నాయకులు తాత వెంకటేశ్వర్లు,సిద్ధంశెట్టి నాగయ్య,శివరాత్రి అచ్చయ్య,బానోతు రాందాస్,వెగ్గళం రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం




- ప్రజాభిమానాన్ని చూరగొన్న రేవంత్ పాలన

టీ మీడియా,సెప్టెంబర్03,సింగరేణి(కారేపల్లి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు.కారేపల్లిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ కుటుంబ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆయన విమర్శించారు.ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగమైందని ఆరోపించారు.గత పాలనలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకుంటూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.పేద,మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు మహిళలు,రైతులు,యువతకు మేలు చేసే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు,ఇందిరమ్మ ఇళ్లు,మహిళలకు వడ్డీలేని రుణాలు,గృహాలకు ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.పింఛన్లు సహా వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ఈ పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభిమానాన్ని చూరగొందని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమమే వాటికి సమాధానమని రాంబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,షాదీఖానా చైర్మన్ ఎండీ యాకూబ్ అలీ,దుబ్బతండా సర్పంచ్ ఆంగోత్ మత్రు,సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య,నాయకులు పొలగాని శ్రీనివాసరావు,సురేందర్ మనియార్,ఎండీ హనీఫ్,తాజుద్దీన్,షేక్ షేర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 11-20 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు

- 16న సరస్వతీ దేవి అలంకరణ

టి మీడియా ,సెప్టెంబర్ 3, విజయవాడ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గాదేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించనున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు ముమ్మర కసరత్తు ప్రారంభించారు.ఉత్సవాల సమయంలో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివస్తారు. జగన్మాత ఆశీస్సులు పొందేందుకు వచ్చే భక్తకోటికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం పాలకమండలి ప్రత్యేకంగా సమావేశమైంది. ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు సంబంధించిన ప్రచార సామగ్రిని లాంఛనంగా ఆవిష్కరించారు. వైదిక కమిటీ సభ్యుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం జరిగింది.

పది రోజులు - పది అలంకారాలు

ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు పది రోజుల పాటు పది విభిన్న అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజుకో రూపంలో అలంకృతురాలయ్యే జగన్మాతను దర్శించుకుని భక్తులు తరించనున్నారు. ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాల వివరాలను ఆలయ స్థానాచార్యులు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ వెల్లడించారు. ఆయా



రోజుల్లో అమ్మవారి అలంకారాల వివరాలు ఇలా ఉన్నాయి.అక్టోబరు 11 - తొలిరోజు : శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి,అక్టోబరు 12 - రెండో రోజు : శ్రీ గాయత్రీ దేవి,

అక్టోబరు 13 - మూడో రోజు : శ్రీ అన్నపూర్ణా దేవి,అక్టోబరు 14 - నాలుగో రోజు : శ్రీ మహాచండీ దేవి,

అక్టోబరు 15 - ఐదో రోజు : శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి,అక్టోబరు 16 - ఆరో రోజు (మూలానక్షత్రం) : శ్రీ సరస్వతీ దేవి,అక్టోబరు 17 - ఏడో రోజు : శ్రీ మహాలక్ష్మి దేవి,అక్టోబరు 18 - ఎనిమిదోవ రోజు : శ్రీ దుర్గాదేవి,అక్టోబరు 19 - తొమ్మిదో రోజు : శ్రీ మహిషాసురమర్ధిని దేవి,అక్టోబరు 20 - చివరిరోజు : శ్రీ రాజరాజేశ్వరి దేవి,కృష్ణమ్మ ఒడిలో తెప్పోత్సవం. దసరా ఉత్సవాల ముగింపు రోజున తెప్పోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. అక్టోబరు 20వ తేదీ సాయంత్రం కృష్ణమ్మ ఒడిలో అమ్మవారికి హంసవాహన తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పాలకమండలి ప్రకటించింది. కృష్ణా నదిలో విహరించే హంస వాహనంపై దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని అధికారులు పేర్కొన్నారు.